# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 23-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు లకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాళులు అర్పించారు.

- మహాత్మాగాంధీకి సంబంధించిన కళాఖండాలు, విలువైన పత్రాలు న్యూఢిల్లీలోని నేషనల్ గాంధీ మ్యూజియంకు చేరాయి.

- రాజ్యాంగ పద్ధతులను ఉపయోగించి సమస్యలకు పరిష్కారం చూపవచ్చని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయి అన్నారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30న ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా భారత స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు లకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాళులు అర్పించారు. సామాజిక మాధ్యమంలో వీడియోను పంచుకుంటూ వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. స్వేచ్ఛ, న్యాయం కోసం వారు చేసిన పోరాటం, త్యాగాలు మనందిరిలో స్ఫూర్తినిస్తూ ఉంటాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దక్షిణాఫ్రికాలోని ఫీనిక్స్ సెటిల్‌మెంట్ ట్రస్ట్-గాంధీ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా మహాత్మాగాంధీకి సంబంధించిన కళాఖండాలు, విలువైన పత్రాలను న్యూఢిల్లీలోని నేషనల్ గాంధీ మ్యూజియంకు అందజేసే కార్యక్రమంలో విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ పాల్గొన్నారు. గాంధీజీ జీవితం, సందేశం భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తాయని డాక్టర్ జైశంకర్ తన సందేశంలో పేర్కొన్నారు. విరాళంగా ఇచ్చిన వస్తువుల జాబితాలో మహాత్మాగాంధీ చేతితో తయారు చేసిన దుస్తులు కూడా ఉన్నాయి.
1893లో దక్షిణాఫ్రికాకు వెళ్ళిన మహాత్మాగాంధీ.. డర్బన్‌లో ఉన్న సమయంలో 1904లో ఫీనిక్స్ సెటిల్‌మెంట్ ట్రస్ట్ స్థాపించారు. భారత్, దక్షిణాఫ్రికా దేశాలతో గాంధీజీకి ఉన్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని, గాంధీ డెవలప్‌మెంట్ ట్రస్ట్, ఫీనిక్స్ సెటిల్‌మెంట్ ట్రస్ట్ మహాత్మాగాంధీకి చెందిన కొన్ని వస్తువులను భారతదేశానికి విరాళంగా అందించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజ్యాంగ పద్ధతులను ఉపయోగించి అన్ని సమస్యలకు పరిష్కారం చూపవచ్చని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయి అన్నారు. మణిపూర్ హైకోర్టు 12వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ కలిసి వస్తే పరిష్కారాలు సులభంగా లభిస్తాయని చెప్పారు. మణిపూర్ లో రెండు రోజులు పాటు పర్యటిస్తున్న ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల బృందానికి నేతృత్వం వహించిన జస్టిస్ గవాయి.. రాజ్యాంగ పద్ధతుల ద్వారా ఐక్యతను, సాధారణ స్థితిని పునరుద్ధరించడం

సాధ్యపడుతుందన్నారు. చురా చంద్ పూర్, బిష్ణుపూర్ లోని సహాయ శిబిరాల్లో ఉన్న ప్రజలతో మాట్లాడారు. చురా చంద్ పూర్ జిల్లాలోని న్యాయ సేవలు, వైద్య శిబిరాలను ఆన్లైన్ విధానంలో ఆయన ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌లోని హిండన్ విమానాశ్రయం నుండి జమ్మూకు విమాన సర్వీసు ఈరోజు ప్రారంభమైంది. గతంలో జమ్మూ వెళ్ళే ప్రయాణికులు, ఢిల్లీ విమానాశ్రయానికి వెళ్లాల్సి వచ్చేది. నూతన సర్వీసుతో హిండన్ విమానాశ్రయం నుండి జమ్మూకు నేరుగా విమాన సేవలు అందుబాటులోకి వచ్చాయి. తిరుగు ప్రయాణంలో జమ్మూ నుండి మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరిన విమానం 2:30 గంటలకు హిండన్ చేరుకుంటుంది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఘజియాబాద్‌లోని హిండన్, జమ్మూ మధ్య శనివారం మినహా వారానికి ఆరు రోజులు విమానాలను నడుపుతుంది. ఈ విమానం ఉదయం 11:30 గంటలకు జమ్మూకు చేరుకుంటుంది. ఇప్పుడు NCR నుండి మాతా వైష్ణో దేవి ఆలయానికి వెళ్లడం సులభతరం అయింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్ల వేడుకలో భాగంగా ఈరోజు బెంగళూరులో మూడు రోజుల అఖిల భారతీయ ప్రతినిధి సభ ముగింపు కార్యక్రమం జరిగింది. సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోశభాలే మాట్లాడుతూ సామాజిక సామరస్యం జాతీయ ఐక్యతను ప్రోత్సహించడానికి మండల స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.
స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, సుఖ్ దేవ్ రాజ్ గురుల బలిదాన దినోత్సవం సందర్భంగా వారికి నివాళులు అర్పించారు. పోర్చుగీసులకు వ్యతిరేకంగా పోరాడిన రాణి అంబక్క 500వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించినట్లు దత్తాత్రేయ హోశభాలే తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఈరోజు పోలీసులకు 22 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు మహిళా నక్సలైట్లు కూడా ఉన్నారు. వీరిపై మొత్తం రూ. 11 లక్షల రివార్డు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి లొంగిపోయిన నక్సలైట్లకు ఒక్కొక్కరికి 25 వేల రూపాయల నగదు ప్రోత్సాహకం అందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. 'మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ముంబయిలోని రాజ్ భవన్ లో నిర్వహించారు. మహారాష్ట్ర గవర్నర్ సీ.పి. రాధాకృష్ణన్.. స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాజ్ భవన్ సిబ్బంది, రాష్ట్ర పోలీసులు పాల్గొన్నారు.
అలాగే.. నాసిక్ లోని ప్రభుత్వ అతిథి గృహంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఉప ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే సామాజిక మాధ్యమం వేదికగా స్వాతంత్ర్య యోధుల ధైర్యం, దేశభక్తి, త్యాగలను గుర్తు చేసుకున్నారు. దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వీరికి దేశం మొత్తం రుణపడి ఉంటుందని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్ము కాశ్మీర్ దోడా జిల్లాలోని మారుమూల అటవీప్రాంతంలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని గుర్తించారు. స్థానిక పోలీసులు, సైన్యం, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్తంగా నిర్వహించిన గాలింపు చర్యల్లో భాగంగా ఒక పిస్టల్, మూడు మ్యాగజైన్లు, AKఅసాల్ట్ రైఫిల్ ను స్వాధీనం చేసుకున్నారు. నిఘా సంస్థల సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. అదేవిధంగా ప్రక్కనే ఉన్న కిస్త్ వార్ జిల్లాలోని గురినాల్, దాత్రి, చత్రో అటవీ ప్రాంతాల్లో పోలీసులు,

సైన్యం, CRPF దళాలు సంయుక్తంగా గాలింపు చర్యలు జరుపుతున్నాయి. అనుమానిత ఉగ్రవాదుల కదలికలపై స్థానిక గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో ఈ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ-కాశ్మీర్ లోని ఉధంపూర్ జిల్లాకు విమాన సేవల ప్రతిపాదనలో భాగంగా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (AAI) క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో విమానయాన రంగం, వైమానిక దళ నిపుణులు, పైలెట్లు ఉన్నారు.
ప్రజల నుండి వచ్చిన అనేక అభ్యర్థనల నేపథ్యంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ హిండన్-జమ్మూ విమాన సర్వీసును ఉధంపూర్‌కు పొడిగించాలని ప్రతిపాదన చేశారు. దీని సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు ఈ కమిటీ వచ్చేవారం ఉధంపూర్‌ను సందర్శిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపిఎల్ సీజన్ లో భాగంగా ఈరోజు సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన T20 మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు 44 పరుగులతో విజయం సాధించింది. సన్ రైజర్స్ 20 ఓవర్స్ లలో 286 పరుగులు చేయగా, రాజస్థాన్ రాయల్స్ జట్టు 242 పరుగులు మాత్రమే చేసింది.
కాగా.. మరొక మ్యాచ్ లో ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు పోటీపడుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ శాసనసభ బడ్జెట్ సమావేశాలు రేపటి నుండి ప్రారంభమై, మార్చి 28వ తేదీ వరకు జరగుతాయి. రేపు ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (డీటీసీ) పనితీరుపై కాగ్ నివేదికను, మంగళవారం బడ్జెట్‌ను సభలో ప్రవేశపెడతారు. ఈ సంవత్సరానికి సంబంధించి, ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలు, అభివృద్ధి ఎజెండాను వివరిస్తారు. ఈ సమావేశంలో, కీలకమైన ఆర్థిక, విధానపరమైన అంశాలను చర్చిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల AI పరిశోధకుడు పార్ కాస్టర్, లెక్స్ ఫ్రిడ్ మ్యాన్ తో చేసిన పోడ్ కాస్ట్ ఇప్పుడు విభిన్న భాషల్లో అందుబాటులో ఉంది. ఈ సంభాషణను విస్తృత సంఖ్యలో ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావడమే దీని లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఒక సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =